నంబర్ ప్లేట్లు నై అయినా రయ్ రయ్

- ప్రమాదాలు జరిగితే ఎవరిని ప్రశ్నించాలి?
- ఆ లారీ వెనుక పెద్దల హస్తం ఉందా!
- అధికారుల తీరుపై అనుమానాలు



మారుతీ సర్కిల్ మార్గంలో తిరుగుతున్న ట్రాన్స్‌పోర్టు లారీ



డాక్‌యార్డ్ రోడ్డులో నంబర్ ప్లేటు లేకుండా తిరుగుతున్న టిప్పర్

మల్కాపురం: మల్కాపురంలోని పలు ప్రాంతాల్లో నంబర్ ప్లేట్లు లేకుండానే టిప్పర్లు, ట్రాన్స్‌పోర్టు లారీలు రయ్‌రయ్ మని తిరుతున్నాయి. నేవల్ డాక్‌యార్డ్,మారుతీ సర్కిల్ ఏరియా, వీడీఆర్ గొడౌన్స్ ఏరియా,మల్కాపురం సేవా మార్గాల్లో ఇలాంటి లారీలు అధికంగా తిరుగుతుంటాయి. వీటిని మితిమీరిన వేగతంలో నడుపుతారు. అలాంటి సందర్భంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరని ప్రశ్నించాలని స్థానికులు మండిపడుతున్నారు. రేయింబవళ్లు ఇలాంటి లారీలు పదుల సంఖ్యలో తిరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మారుతి సర్కిల్ వైపు గల గొడౌన్స్‌లో ఎరువులు,గోధుమలు ఇలా పలు **సరకులు రవాణా చేసే లారీలు** తిరుగుతుంటాయి. **వీటిలో కొన్నింటికి నంబర్ ప్లేట్లు** ఉన్నా భూతద్దం పెట్టి చూసినా కనిపించని విధంగా ఉన్నాయి. అలాగే డాక్‌యార్డ్ మార్గంలో పోర్టు నుంచి బొగ్గు తదితర సరకులను గొడౌన్స్‌కు టిప్పర్లు తరలిస్తుంటాయి. ఇలా తిరగిన టిప్పర్లలో చాలా వాటికి నంబర్ ప్లేట్లు లేవు. ఇవి పగలు రాత్రి అన్న తేడా లేకుండ రోడ్డుపై చక్కెర్లు కొడుతున్నా వీటి వంక ట్రాఫిక్ పోలీసులు కన్నెత్తి చూడరు. పొరపాటున ఈ లారీల్లో ఏదైనా ఢీకొట్టి ప్రమాదం జరిగితే ఆ లారీ నెంబర్ తెలుసుకోలేని విధంగా ఉంటుంది. సాధారణ తనిఖీలు చేసే ట్రాఫిక్ పోలీసులు ద్విచక్ర వాహనదారుల నంబర్ ప్లేట్లు సరిగ్గా కనిపించకుంటే జరిమానాలు విధిస్తారు. మరి ఇలాంటి లారీల విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్థం కాని ప్రశ్న!.



కల్యాణి ఆస్పత్రి రక్షణ గోడకు ఆనుకుని సర్వీసు రోడ్డులో పార్కింగ్ చేసిన నంబర్లు లేని లారీలు



మల్కాపురం సేవా మార్గంలో..

క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ



పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న యువత

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ఆర్‌కే పురం కొత్త పెట్రోల్ బంక్ సెంటర్ వద్ద స్థానిక ఆటో స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ట్రాన్స్‌పోర్టు యజమాని కాండ్రేంగుల వెంకటరమణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఆటో స్టాండ్ యూనియన్ సభ్యులు ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆటో స్టాండ్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్కాపురం పాఠశాల విద్యార్థుల ప్రతిభ



స్కాలర్‌షిప్‌కు అర్హత పొందిన విద్యార్థులు

మల్కాపురం: మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 13 మంది విద్యార్థులు నేషనల్ మీన్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారు. జీవీఎంసీ పరిధిలో మొదటి స్థానంలో,జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు.ఏటా ఈ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌సిప్ ఎంపిక పరీక్షకు హాజరవుతుంటారు. పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు గౌతమి, రోషిణిప్రియ,డి.వరలక్ష్మి,ఎండీసగుఫా,డి.యశ్వంత్,ఎస్.జగదీష్, కె.సుకుమార్,ఎస్‌కే. ఫర్వాని,ఎం.భార్గవ్,ఎస్‌కేరషిదా, కె.రాజు,పి. నందకుమార్,ఎన్.కీర్తన స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు.వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్.అరుణకుమారి,ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బి.వి.ఎస్.కుమార్ ఆదివారం పాఠశాల వద్ద అభినందించారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న మల్కాపురం గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్ ఏడు గుడుల సెంటర్ వద్ద ఆదివారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు భోగవల్లి నాగభూషణం,కమిటీ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావుయాదవ్,కోశాధికారి పట్నాల పెంటరావు,ఉపాధ్యక్షుడు ఎల్లేటి గోవిందరాజు,మజ్జి రమేష్‌పాత్రుడు తదితరులు పాల్గొని సుమారు 300 మందికి చీరలు అందజేశారు. గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ అమ్మవార్ల ఉత్సవాల్లో భక్తులు చీరలు కానుకగా ఇస్తుంటారని, ఇలా వచ్చిన చీరలు సేకరించి ఏడాదిలో ఓ రోజు పేదలకు అందిస్తున్నామని చెప్పారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి



మురళీనగర్ అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడుతున్న జెడ్సీ రాము

మురళీనగర్: విశాఖలో ఈ నెల 21న నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జీవీఎంసీ జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము పిలుపునిచ్చారు. మురళీనగర్, మాధవధార జంట కాలనీల్లోని అపార్ట్‌మెంట్ వాసులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగా దినోత్సవాన్ని రికార్డుల్లో నమోదయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఇందులో పాల్గొనే వారికి ఉచితంగా బస్సు ఏర్పాటు చేశామని, టీ-షర్టులు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల వరప్రసాద్, వివిధ అపార్ట్‌మెంట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదోడి పంకా.. గిరా గిరా



విసనకర్రలు విక్రయిస్తున్న వ్యక్తి



విసనకర్రలు

విశాఖ విద్య: ఎన్ఏడీ జంక్షన్‌లో తాటాకు విసనకర్రల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. విజయనగరం దరి జొన్నాడ పరిసర గ్రామాల నుంచి కొంతమంది విసనకర్రలను తీసుకొచ్చి బాజీ జంక్షన్ రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఒక్క విసనకర్ర అయితే రూ.20.. అదే రెండు అయితే రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. వేసవి కాలంలో కావడంతో విసనకర్రలను కొనుగోలు చేసేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. తాటాకుతో తయారు చేసే విసనకర్ర ఒకప్పుడు వేసవి కాలంలో ప్రతీ ఒక్కరి చేతిలో కనిపించేది. తాటాకుతో తయారు చేసింది కావడంతోదీని ద్వారా వచ్చే గాలి ఎంతో పరిశుభ్రమైనదని వైద్యులు చెబుతున్నారు.అందుకే పల్లెల్లోనే కాకుండా నగరంలోని అపార్ట్‌మెంట్‌లలో ఉండే వారు సైతం వీటిని కొనుగోలు చేస్తున్నారు.

సేవాకార్యక్రమాలతో సంతృప్తి

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి దొడ్డి కిరణ్ ఆదివారం జీవీఎంసీ 88వ వార్డు కోటనరవలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తన తండ్రి 22వ వర్ధంతి సందర్భంగా డీకే ఫౌండేషన్ ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, నాయకులు దాడి నూకరాజు, నాగసూరి అప్పారావు, మళ్ల రమణ, బంగారు నాయుడు, ఆళ్ల పైడిరాజు, దొడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న దొడ్డి కిరణ్

విద్యాహక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలి

సీతంపేట: విద్యా హక్కు చట్టం-2009ను పటిష్టంగా అమలు చేయాలని రైట్ ఎడ్యుకేషన్ ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు డిమాండ్ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో విద్యా హక్కు చట్టం అమలు తీరుపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజుల నియంత్రణ చట్టం కఠినంగా అమలు చేయాలని కోరారు. విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకు తల్లిదండ్రులు సమైఖ్యంగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధాన ప్రకటన చేయాలని, ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లోని నోటీస్ బోర్డుల్లో ఫీజుల వివరాలు ఉండేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. డ్రాప్ అవుట్స్ తగ్గించేలా, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు, సామాజిక వేత్తలు కరుణ, విశ్వనాథం, హుస్సేన్, పి.సి.రావు, సత్యవతి, నరసింహారావు, చాట్ల బాబూరావు రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు

సత్ప్రవర్తనతో నడుచుకోండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కంచరపాలెం సీఐ చంద్రశేఖర్

మర్రిపాలెం: ఎటువంటి తగాదాలు, గొడవల జోలికి పోకుండా రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ చంద్రశేఖర్ సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు ఎటువంటి అఘా యిత్యాలు, కొట్లాటల జోలికి వెళ్లినా ఊరు కునేది లేదని హెచ్చరించారు. వారిపై ఎల్లప్పు డూ నిఘా ఉంటుందని, హద్దు మీరి ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మంచిగా మెలగాలని, కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవించాలని రౌడీషీటర్లకు సీఐ సూచించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ చిన్నంనాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు ఎటువంటి గొడవల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. హద్దు మీరితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

యోగా సాధనతో బహుళ ప్రయోజనాలు



భెల్ క్రీడా మైదానంలో యోగా సాధనలో సీనియర్ సిటిజన్స్

అక్కిరెడ్డిపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లి కోరారు. భెల్ క్రీడా మైదానంలో వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం యోగాంధ్ర - 2025 సీనియర్ సిటిజన్స్‌తో యోగా సాధన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ యోగాను జీవన శైలిలో భాగం చేసుకోవాలన్నారు. అంతర్జాతీయ యోగా డేను నెల రోజుల ముందుగానే చేపట్టడం జరిగిందన్నారు. భెల్ వాకర్స్ క్లబ్ యోగాంధ్ర -2025 వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈరుపుగంటి అనార్‌బాబు, కార్యదర్శి కె.భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యోగా ట్రైనర్ డాక్టర్ పసుపులేటి లక్ష్మణరావు, ఆయుష్ విభాగం డాక్టర్ హరికృష్ణ, మింది హోమియోపతి హాస్పటల్ వైద్యురాలు డాక్టర్ ఆర్.శ్రీదేవి, ఏయూ యోగా విభాగం ట్రైనర్ కె.తేజా భాస్కరరావు, ఇంటక్ నాయకుడు ఉరుకూటి బాబూరావు, యోగా విభాగం శిక్షకుడు జి.అఖిల్ సూర్యతేజ, బీహెచ్‌పీవీ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ మెంబర్ నామాన సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

మధుర స్మృతులు



స్టెప్‌లు వేస్తున్న గాయకుడు మల్లికార్జున్

- అపూర్వంగా 1990-91 బ్యాచ్ విద్యార్థుల కలయిక
- పాఠశాల అభివృద్ధికి దోహదపడాలని తీర్మానం



ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు

గోపాలపట్నం: ఆ నాటి ఆ స్నేహ గీతాలు గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వెల్లివిరిసాయి. స్నేహితులంతా కలసి నాటి మధుర స్మృతుల్ని గుర్తుకు తెచ్చుకుని ఆనందాలు పంచుకున్నారు. అమరికలు లేని సంతసాల పూలు వికసించి పరిమళాలు వెదజల్లాయి. దీనికి తోడు ప్రఖ్యాత గాయకుడు మల్లికార్జునరావు పాటలు ఆటలు మరింత ఉత్సాహాన్ని తెచ్చి పెట్టాయి. ఆదివారం జరిగిన ఈ సందడికి గోపాలపట్నం బాలికల హైస్కూల్ వేదికయింది. 1990-91 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు కలిసిన సందర్భం వారి జ్ఞాపకాల పుటల్లో ప్రత్యేక పేజీగా నిలిచింది. యూనియన్‌గా ఏర్పడి అందరినీ కూడగట్టారు. సమయం అనుకుని కలిశారు. ఇందుకు సహకరించిన సహచర సభ్యులకు కమిటీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గణబాబు హాజరై పూర్వ విద్యార్థులను అభినందించారు.

ప్రత్యేక ఆకర్షణగా సింగర్ మల్లికార్జున్

నేపథ్య గాయకుడు బోడ మల్లికార్జున్ ఆత్మీయ కలయికలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నాటి స్నేహితులను కలవడం.. అందరినీ పేర్లతో పిలవడంతో చాలా మంది ఉబ్బితబ్బియ్యారు. థియేటర్లో సినిమాలు చూసి పాటలు పాడేవాడినని గుర్తు చేసుకున్నారు. పలు సినిమాల్లో పాడిన పాటలు పాడి ఉర్రూతలూగించారు. డ్యాన్స్ మాస్టర్ శివశంకర్‌తో కలసి స్టెప్పులేశారు. తనకు చిన్నాటి మిత్రుడు శివశంకర్ అని పరిచయం చేశారు.

ఉపాధ్యాయులను సత్కరించిన విద్యార్థులు

గోపాలపట్నం హెచ్ఎం స్వర్ణలతతో పాటు వీరు చదువుకునే సమయంలో పని చేసిన అటెండర్ చంద్రకళను ఘనంగా సత్కరించారు. కార్యక్రమం ఘనంగా జరిగేందుకు సహకరించిన సహచరులు సూర్యనారాయణ, చెక్కా శేషగిరి, నర్సింహమూర్తి తదితరులను అభినందించారు. కార్యక్రమంలో పైడిరాజు, సురేష్, శ్రీనివాసరావు, దేవి, దీప్తి, కిషోర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



హే నేనే... ఇది నువ్వే... పాతచిత్రాల్లో సంతోషాలు వెతుకుతున్న పూర్వ విద్యార్థులు

నేడు పైడితల్లి తొలేళ్లు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి తొలేళ్ల పండగ సోమవారం జరగనుంది. రాత్రి గ్రామంలో ఘటాల ఊరేగింపు ఘనంగా జరపనున్నారు. అమ్మవారి పూజారి వంశస్తుల ఆధ్వర్యంలో రాత్రి గంట దీపాల ఉత్సవాన్ని నిర్వహిస్తారు. తొలేళ్లను పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో మార్కెట్‌లోని పుష్కరిణి సత్రం వద్ద రాత్రి 7 గంటల నుంచి నృత్యప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పెందుర్తికి చెందిన నిర్మలా నృత్యనికేతన్, గాజువాకకు చెందిన నాట్యారాధన సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వీఎంఆర్‌డీఏ 'డెక్' భవనం పరిశీలన

మహారాణిపేట: వీఎంఆర్‌డీఏ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'డెక్' భవన సముదాయాన్ని ఆదివారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి పరిశీలించారు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్న ఈ భవనానికి సంబంధించిన అన్ని పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భవనంలో అన్ని మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎం పర్యటన తేదీ ఖరారయ్యే నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి భవనాన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలన్నారు. వీఎంఆర్‌డీఏ ఇంజినీరింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తాటిముంజెలకు భలే గిరాకీ



తాటిముంజెలను తీస్తున్న వ్యక్తి



నోరూరించే తాటిముంజెలు

విశాఖ విద్య: సీజనల్ ఫలాల రుచులు తప్పనిసరిగా చూడాల్సిందే. అవి ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తాయని వైద్యనిపుణులు సైతం చెబుతున్నారు. ఆ కోవకు చెందినవే తాటిముంజెలు. వేసవిలో మాత్రమే దొరికే తాటిముంజెలు నగర వాసుల ముంగిటకు వచ్చాయి. మరికొద్ది రోజుల మాత్రమే ఇవి లభ్యమయ్యే పరిస్థితి ఉండటంతో వీటిని తినేందుకు అంతా ఆసక్తి కనబరుస్తున్నారు. విజయనగరం జిల్లా కొత్తవలస ప్రాంతం నుంచి తాటికాయలను తీసుకొచ్చి ఎన్ఏడీ పరిసర రహదారుల పక్కన విక్రయిస్తున్నారు. డజను తాటిముంజెలు రూ.50లకు దొరుకుతుండడంతో వీటిని పిల్లలు,పెద్దలు ఎంతో ఇష్టంగా కొనుగోలు చేసి తింటున్నారు. ఎన్ఏడీ నుంచి బిర్లా జంక్షన్ వైపు వచ్చే దారిలో అదే విధంగా బాజీ జంక్షన్ వంటి చోట రోజంతా తాటి ముంజెలు తీసి విక్రయిస్తున్నారు.

డీఎస్సీ పరీక్షకు 357 మంది హాజరు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వవార్డు బుచ్చిరాజు పాలెం ఆరోవనా డిజిటల్ జోన్ కేంద్రంగా జరుగుతున్న డీఎస్సీ పరీక్షకు ఆదివారం 357 మంది హాజరైనట్లు ఎంఈవో దివాకర్ తెలిపారు. ఆదివారం నాటి పరీక్షకు 450 మంది నమోదు చేసుకోగా వీరిలో 93 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. డీఈవో ఆదేశానుసారం పరీక్షల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఎంఈవో దివాకర్ తెలిపారు.

ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

డాబాగార్డెన్స్: ఆర్యవైశ్య యువజన సంఘం 49వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని పాతనగరంలోని వాసవీ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26 సంవత్సరానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నేతి శ్రీనివాసరావు అధ్యక్షుడిగా, కట్టమూరి సూర్యనారాయణ కార్యదర్శిగా, దుర్గా నూకేశ్వరరావు కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సంఘం పూర్వ అధ్యక్షుడు నల్లూరి నూకరాజు తెలిపారు. గుండా శ్రీనివాస్ (వర్తక విభాగం), కొల్లూరు సోమేశ్వరరావు(ఉద్యోగ విభాగం), దుర్గా శాంతి(మహిళా విభాగం)తో పాటు కొత్త అరుణ్‌కుమార్, కల్లూరి సత్తిబాబు, వంకాయల సృజన ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వర్తక విభాగం నుంచి 20 మంది, ఉద్యోగ విభాగం నుంచి 16, మహిళా విభాగం నుంచి ఆరుగురిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కేవస్ దుర్గారావు, కోశాధికారి పీవీఎస్ఎన్‌వీ సాంబమూర్తి, కన్యకాపరమేశ్వరి దేవస్థానం సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, వాసవీ కల్యాణమండపం సంఘం అధ్యక్షుడు విన్నకోట రామమూర్తి, పట్నాల వెంకటరెడ్డి, గ్రంధి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.